ఇస్రో@100

- విజయవంతమైన వందో ప్రయోగం
- 46 ఏండ్లలో 100 ప్రయోగాలు చేపట్టిన ఇస్రో
- వీటిల్లో పీఎస్ఎల్వీ ద్వారానే 62 మిషన్లు
- ఐదేండ్లలో మరో వంద ప్రయోగాలే లక్ష్యం



శ్రీహరికోట, జనవరి 29: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) కీలక మైలురాయిని అందుకుంది. 100వ ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేసి చరిత్ర సృష్టించింది. భారత దేశ అంతరిక్ష ప్రయోగ సామర్థ్యాన్ని సగర్వంగా ప్రపంచానికి చాటిచెప్పింది. 1979లో మొదటి ప్రయోగంతో ప్రారంభమైన ప్రస్థానాన్ని శత ప్రయోగంతో దిగ్విజయంగా కొనసాగిస్తున్నది. బుధవారం శ్రీహరికోట నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్15 వాహక నౌక ద్వారా ఎన్వీఎస్-02 అనే నావిగేషన్ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. 27.30 గంటల కౌంట్‌డౌన్ తర్వాత బుధవారం ఉదయం 6.23 గంటలకు నింగికి ఎగిసిన వాహకనౌక 19 నిమిషాల ప్రయాణం తర్వాత ఉపగ్రహాన్ని జియోసింక్రోనస్ ట్రాన్స్ ఫర్ ఆర్బిట్(జీటీఓ)లో విజయవంతంగా ప్రవేశపెట్టినట్టు ఇస్రో ప్రకటించింది. 2025లో ఇస్రో చేపట్టిన మొదటి ప్రయోగమిది. భారత ఉపఖండంలో అత్యంత కచ్చితత్వంతో నావిగేషన్ వ్యవస్థను ఏర్పాటు చేసే లక్ష్యంతో పంపిస్తున్న నావిక్ శ్రేణి ఉపగ్రహాల్లో ఎన్వీఎస్-02 రెండోది. భూఉపరితల, ఆకాశ, సముద్ర నావిగేషన్‌కు, వ్యవసాయ, ప్రయాణ, లోకేషన్ ఆధారిత మొబైల్ సేవలు, ఉపగ్రహాల కక్ష్య నిర్ధారణకు ఈ ఉపగ్రహం ఉపయోగపడుతుంది. దీనిని బెంగళూరులోని యూఆర్ రావు శాటిలైట్ సెంటర్ అభివృద్ధి చేసింది.

ఇస్రో ఘనతను చాటిన పీఎస్ఎల్వీ

తక్కువ ఖర్చుతో అంతరిక్ష ప్రయోగాల్లో ఘనమైన విజయాలు సాధించిన ఇస్రోకు పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికిల్(పీఎస్ఎల్వీ) అత్యంత నమ్మకమైన, అచ్చొచ్చిన వాహక నౌక. ఇప్పటివరకు ఇస్రో వంద ప్రయోగాలు చేపట్టగా, అందులో 62 పీఎస్ఎల్వీ ద్వారానే చేపట్టింది. 17 ప్రయోగాలను జీఎస్ఎల్వీ ద్వారా చేపట్టింది. పీఎస్ఎల్వీ-డీ1 ద్వారా 1993 సెప్టెంబర్ 20న మొదటిసారి పీఎస్ఎల్వీ వాహకనౌకను ఇస్రో ప్రయోగించింది. ఈ ప్రయోగం విఫలమైనా 1994లో విజయవంతమైన ప్రయోగంతో ఇస్రోకు పీఎస్ఎల్వీ అనేక విజయాలను అందించింది. కాగా, ఇస్రో ఇప్పటివరకు ఆరు తరాల వాహకనౌకలను తయారుచేసింది. ప్రొఫెసర్ సతీశ్ ధావన్ మార్గదర్శకంలో, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలామ్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా 1979లో మొదటి వాహకనౌక ఎస్ఎల్వీ-3 ఈ1ను తయారుచేసింది.

ఐదేండ్లలో 100 ప్రయోగాలే లక్ష్యం

వంద ప్రయోగాలను పూర్తి చేయడానికి 46 ఏండ్లు పట్టినప్పటికీ, ఇప్పుడు అత్యంత వేగంగా ఇస్రో ప్రయోగాలు కొనసాగుతున్నాయి. మరో ఐదేండ్లలో ఇంకో 100 ప్రయోగాలు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నది. రానున్న ఐదేండ్లలో ప్రయోగాల్లో 200 మార్కులు అందుకుంటామని ఇస్రో చైర్మన్ వీ నారాయణన్ విశ్వాసం వ్యక్తం చేశారు. 46 ఏండ్ల ఇస్రో ప్రస్థానంలో 548 ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టిందని ఆయన తెలిపారు. నెక్స్ట్ జనరేషన్ లాంచ్ వెహికిల్(ఎన్జీఎల్వీ) అభివృద్ధిపై దృష్టి సారించామని చెప్పారు.

ఇస్రోకు 'వంద'నం: కేటీఆర్

హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): ఇస్రో చేపట్టిన వందో ప్రయోగం శాస్త్రవేత్తలు, సిబ్బంది అంకితభావం, పట్టుదలకు నిదర్శనమని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందించారు. ఆర్యభట్ట నుంచి మంగళ్‌యాన్ దాకా ఇస్రో చేసిన 100 ప్రయోగాలు దేశాన్ని గర్వించేలా చేశాయని పేర్కొన్నారు. విక్రమ్ సారాభాయ్ వంటి మహనీయులు వేసిన కక్ష్యలో పయనిస్తూ భారత అంతరిక్ష రంగం అద్భుత ఫలితాలు సాధిస్తున్నదని ఆయన కొనియాడారు.

దేశానికి గర్వకారణం: మాజీ మంత్రి హరీశ్‌రావు

అంతరిక్ష పరిశోధనా రంగంలో ఇస్రో శాస్త్రవేత్తలు సృష్టిస్తున్న అద్భుతాలు దేశానికి గర్వకారణమని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇస్రో వందో ప్రయోగాన్ని ఆయన అభినందించారు. ఈ స్ఫూర్తితో దేశ అంతరిక్ష పరిశోధన రంగం మరింత అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు.

ఏఐ రేసులోకి అలీబాబా

క్వెన్ 2.5 పేరుతో ఏఐ మాడల్

బీజింగ్: కృతిమ మేధ(ఏఐ) రంగంలో చైనా మరో సంచలనం సృష్టించే అవకాశం కనిపిస్తున్నది. చాట్‌జీపీటీని మించేలా 'డీప్‌సీక్'ను అందుబాటులోకి తీసుకురాగా, చైనాకు చెందిన అలీబాబా సైతం ఏఐ రేసులోకి దూసుకొచ్చింది. 'క్వెన్ 2.5-మాక్స్' పేరుతో ఒక ఏఐ మాడల్‌ను బుధవారం షాంఘైలో ఆవిష్కరించింది. ప్రస్తుతం అందుబాటు ఉన్న ఏఐ మాడళ్లను మించి అత్యుత్తమంగా పని చేసినట్టు ప్రకటించింది.

హిందూ వివాహం పరమ పవిత్రం

- అసాధారణ ఇబ్బందులుంటే తప్ప ఏడాదిలోగా విడాకులు కుదరదు
- అలహాబాద్ హైకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ, జనవరి 29: ఇద్దరు హిందువుల మధ్య జరిగిన వివాహం ఎంతో పవిత్రమైనదని, వైవాహిక జీవితంలో అసాధారణమైన ఇబ్బందులంటే తప్ప అలాంటి వివాహాలను ఏడాదిలోగా రద్దు చేయడం కుదరదని అలహాబాద్ హైకోర్టు తేల్చిచెప్పింది. హిందూ వివాహ చట్టంలోని సెక్షన్ 14 ప్రకారం విడాకులకు దరఖాస్తు చేసుకోవాలంటే వివాహం జరిగి కనీసం ఏడాదైనా గడిచి ఉండాలని, అసాధారణమైన ఇబ్బందులుంటేనే అలాంటి పిటిషన్‌ను విచారణకు స్వీకరించే వీలుంటుందని జస్టిస్ అశ్వనీ కుమార్ మిశ్రా, జస్టిస్ డీ రమేశ్ ధర్మాసనం స్పష్టం చేసింది. నిశాంత్ భరద్వాజ్, రిషిక గౌతమ్ అనే దంపతులు తమ వివాహం రద్దు కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారి వైవాహిక జీవితంలో అసాధారణ పరిస్థితులున్నట్టు పేర్కొనకపోవడం వల్లే వారి దరఖాస్తును డిస్మిస్ చేస్తున్నామనితీర్పులో పేర్కొంది.

సహజీవన జంటలకు కాంట్రాక్ట్ తప్పనిసరి

రాజస్థాన్ హైకోర్టు ఆదేశం

జైపూర్, జనవరి 29: వివాహం చేసుకోకుండా కలిసి జీవిస్తున్న జంటలు ఇక నుంచి తమ సహజీవనంపై ఒప్పందం, రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని రాజస్థాన్ హైకోర్టు బుధవారం ఆదేశించింది. దీనికి సంబంధించిన విధానాన్ని అమలు చేయాలని జస్టిస్ అనూప్ కుమార్ ధండ్ ఆదేశాలు జారీ చేశారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాన్ని రూపకల్పన చేసే వరకు అధికార యంత్రాంగం ద్వారా పథకాన్ని చట్టపరమైన ఆకృతిలో రూపొందించాలని సూచించారు. సహజీవనం చేయాలనుకునే జంటలు, భాగస్వాములు తప్పనిసరిగా ఒప్పందాన్ని చేసుకుని, రిజిస్టర్ చేసుకోవాలని, అందులోని నిబంధనలు, షరతులను పాటించాలని, జంటలకు పిల్లలు పుడితే వారి చదువు,ఆరోగ్యం తదితర అంశాలను ఉంచాలనిఆదేశించారు.

ఘటనాస్థలం నుంచి ఓ భక్తుడి మృతదేహాన్ని తరలిస్తున్న పోలీసులు.. రోదిస్తున్న బాధిత కుటుంబ సభ్యుడు

కుంభమేళాలో తొక్కిసలాట

మొదటిపేజీ తరువాయి...

వరకు గాయపడ్డారు. తొక్కిసలాట కారణంగా కొంతసేపు సంగమం ఘాట్ వద్ద పవిత్రస్నానాలకు ఆటంకం ఏర్పడింది.

మౌని అమావాస్య కావడంతో..

కుంభమేళ జరిగే రోజుల్లో మౌని అమావాస్యను భక్తులు పవిత్రంగా భావిస్తారు. అమావాస్య బ్రహ్మ ముహూర్తంలో పవిత్ర స్నాన మాచరించడం పుణ్యమనే నమ్మకం ఉంది. ఇందులోనూ త్రివేణి సంగమం ఘాట్ వద్ద స్నానాలు చేసేందుకు ఎక్కువ మంది భక్తులు వచ్చారు. ఈ ఘాట్‌కు కిలోమీటరు దూరంలో, అఖాడాలు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన దారి వద్ద రద్దీ అదుపు తప్పి తొక్కిసలాట జరిగింది. భక్తులు బారికేడ్లు విరగ్గొట్టడం, వాటి పైనుంచి దూకడంతో తొక్కిసలాట చోటు చేసుకున్నట్టు డీఐజీ వైభవ్ కృష్ణ తెలిపారు. 90 మందిని దవాఖానకు తరలించగా, వీరిలో 30 మంది మరణించినట్టు చెప్పారు.

ప్రయాగ్‌రాజ్‌లో 10 కోట్ల మంది

తొక్కిసలాట ఘటనతో సంగమం ఘాట్ వద్ద స్నానాలకు కొంత సేపు ఆటంకం ఏర్పడింది. అమృత ఘడియల్లో అఖాడాలు పుణ్యస్నానం చేయాల్సి ఉండగా, ఘటన కారణంగా వాయిదా వేసుకోవాలని సీఎం యోగి కోరారు. దీంతో మధ్యాహ్నం అఖాడాలు స్నానమాచరించారు. ఘటనకు కారణాలు తెలుసుకునేందుకు జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు యోగి తెలిపారు. ప్రయాగ్‌రాజ్‌లో పరిస్థితి అదుపులో ఉన్నప్పటికీ, ఒత్తిడి మాత్రం కొనసాగుతున్నదని ఆయన పేర్కొన్నారు. బుధవారం 9-10 కోట్ల మంది ప్రయాగ్‌రాజ్‌లో ఉన్నారని ప్రకటించారు.

వీఐపీలపైనే ప్రభుత్వం ధ్యాస: విపక్షాలు

తొక్కిసలాట ఘటన నేపథ్యంలో కేంద్రం, యూపీ ప్రభుత్వంపై విపక్షాలు మండిపడ్డాయి. ప్రభుత్వ యంత్రాంగం కేవలం వీఐపీలపైనే ధ్యాస పెట్టడం, నిర్వహణ వైఫల్యం వల్లే ఘటన జరిగిందని ధ్వజమెత్తాయి. దుర్ఘటనపై యూపీ మంత్రి సంజయ్ నిషాద్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'ఇలాంటి పెద్ద కార్యక్రమాల్లో, ఎక్కువ మంది జనం వచ్చిన దగ్గర చిన్న చిన్న సంఘటనలు జరుగుతూనే ఉంటాయి.' అని వ్యాఖ్యానించారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో విషాదాలు

- జూలై 2, 2024: యూపీలోని హత్రాస్‌లో భోలే బాబా నిర్వహించిన సత్సంగ్‌లో జరిగిన తొక్కిసలాటలో 100 మందికి పైగా మృతి.
- మార్చి 31, 2023: ఎంపీలోని ఇండోర్‌లో శ్రీరామ నవమి వేడుకల్లో శ్లాబ్‌కూలి 36 మంది కన్నుమూత.
- జూలై 14, 2015లో ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రిలో గోదావరి పుష్కరాల మొదటిరోజు జరిగిన తొక్కిసలాటలో 27 మంది మృతి.
- అక్టోబర్ 12, 2013: ఎంపీ రత్నగఢ్ ఆలయం వద్ద నవరాత్రి వేడుకల్లో తొక్కిసలాటలో 115 మంది మృతి.
- జనవరి 14, 2011: శబరిమలలో భక్తులపైకి జీప్ దూసుకురావడంతో తొక్కిసలాట.104 మంది మృతి
- సెప్టెంబర్ 30, 2008: రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ చాముండా దేవీ ఆలయంలో బాంబు ఉందనే పుకార్లు వ్యాపించి తొక్కిసలాట. దాదాపు 250 మంది మృతి.
- జనవరి 25, 2005: మహారాష్ట్ర మంధార్‌దేవి ఆలయంలో తొక్కిసలాటతో దాదాపు 340 మంది మృతి.
- ఫిబ్రవరి 3, 1954: స్వాతంత్ర్యం తర్వాత జరిగిన తొలి కుంభమేళాలో 800 మంది మృతి

బాధాకరం: కేసీఆర్

హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): కుంభమేళాలో భక్తుల మరణాల పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. మహా కుంభ మేళాలో పవిత్రస్నానాలు ఆచరిస్తున్న భక్తులు తొక్కిసలాటలో మరణించడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

కేటీఆర్ దిగ్భ్రాంతి

హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): మహాకుంభమేళాలో తొక్కిసలాట జరిగి 30 మంది మరణించటం పట్ల బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటన తీవ్రంగా కలచివేసిందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ఘటనలో క్షతగాత్రులైనవారికి వైద్యసేవలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

తొక్కిలాట ఘటన కలిచివేసింది: హరీశ్‌రావు

హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): మహాకుంభమేళాలో తొక్కిసలాట ఘటన కలిచివేసిందని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. మృతుల కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆప్తులను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న వారిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు.

రాజకీయ కారణాల కన్నా ప్రతిభనే గుర్తించాలి

రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం మందలింపు

హైకోర్టులలో పీపీల నియామకంపై ఆక్షేపణ

న్యూఢిల్లీ : రాజకీయ కారణాలతో రాష్ట్ర ప్రభుత్వాలు హైకోర్టులలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించడాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టింది. ప్రతిభ కన్నా ఆశ్రిత పక్షపాతం, బంధుప్రీతికి అధిక ప్రాధాన్యం లభిస్తున్నాయని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. న్యాయమూర్తులు కూడా మనుషులేనని, కొన్ని సార్లు వారు కూడా తప్పు చేస్తారని జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం అభిప్రాయం వ్యక్తం చేసింది. న్యాయస్థానం తప్పు చేస్తే సరిదిద్దాల్సిన బాధ్యత డిఫెన్స్ న్యాయవాది, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌పైన ఉందని ధర్మాసనం పేర్కొంది. తప్పు చేసే వారి నుంచి అమాయకులను రక్షించి వారికి న్యాయం చేసే లక్ష్యంతో పనిచేసే న్యాయమూర్తులు నడిపే రథానికి న్యాయాధికారులు ముఖ్యమైన చక్రాలలో ఒకటని వారు తెలిపారు. ప్రతిభ ఆధారంగానే ఏజీపీలు, ఏపీపీలును నియమించాలన్నదే ఈ తీర్పు ఇచ్చే సందేశమని ధర్మాసనం స్పష్టం చేసింది.

సౌదీలో రోడ్డు ప్రమాదం..

9 మంది భారతీయుల మృతి

న్యూఢిల్లీ : సౌదీ అరేబియాలోని పశ్చిమ ప్రాంతమైన జిజాన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో 9 మంది భారతీయులు మరణించారు. దీనిపై జెడ్డాలోని భారత కాన్సులేట్ సంతాపం ప్రకటించింది. బాధిత కుటుంబాలకు సంపూర్ణ సహకారాన్ని అందచేస్తామని బుధవారం ఓ ప్రకటనలో కాన్సులేట్ హామీ ఇచ్చింది. ఈ ప్రమాదంలో గాయపడిన వారు త్వరితంగా కోలుకోవాలని ఆకాంక్షించింది. సమాచారం కోసం ఓ ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపింది. ప్రమాద ఘటనపై భారత విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్ విచారం వ్యక్తం చేశారు. జెడ్డాలోని కాన్సుల్ జనరల్‌తో తాను మాట్లాడానని, బాధిత కుటుంబాలతో ఆయన సంప్రదింపులు జరుపుతూ సౌదీ అధికారులతో సమన్వయం చేస్తున్నారని జైశంకర్ తెలిపారు.

మధ్యముడే ఉత్తముడు!

- తోబుట్టువుల కన్నా ఉత్తమ లక్షణాలు
- సమాజం పట్టించుకోకున్నా అన్నింటిలో ముందంజ
- తాజా సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 29: సాధారణంగా సంతానంలో మధ్యములను అందరూ నిర్లక్ష్యం చేస్తుంటారు. తల్లిదండ్రులు కూడా ఇంటికి పెద్దవాడనో, చిన్నోడు అనో గారాబం చేస్తారే తప్ప వారిద్దరి మధ్యన పుట్టిన వారిని అంతగా పట్టించుకున్నట్టు అన్పించదు. అయితే మిగిలిన తోబుట్టువుల కంటే మధ్యన జన్మించిన వారే ఉత్తమ లక్షణాలను కలిగి ఉంటారని, ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని ఒక సర్వే తెలియజేసింది. మధ్యమ సంతానం అటు తమ కన్నా పెద్దవారు, తమకన్నా చిన్నవారి మధ్య నలిగిపోతుంటారు. పైగా వారు తరచూ నిర్లక్ష్యానికి గురవుతుంటారు. అయితే మిగిలిన తోబుట్టువుల కంటే వీరే అన్నింటిలో మెరుగ్గా ఉన్నట్టు ఆ సర్వే తెలియజేసింది. తీవ్రమైన ఒత్తిడి వల్లే వజ్రాలు తయారయిన విధంగా పెద్ద, చిన్న మధ్య తీవ్ర ఒత్తిడిని అనుభవించిన వీరు మెరుగైన పౌరులుగా మారుతారని పేర్కొంది. కెనడాకు చెందిన పరిశోధకులు ఈ సర్వే నిర్వహించారు. వ్యక్తిత్వ రూపకల్పనలో జననక్రమం కీలకపాత్ర పోషిస్తుంది. ఉదాహరణకు ఒక కుటుంబంలో తొలి సంతానంగా జన్మించిన వారిని బాధ్యతాయుత, చురుకైన వ్యక్తులుగా చూస్తారు. అయితే తమ్ముడును తరచుగా ప్రశాంతంగా, రిలాక్స్‌గా ఉండే వ్యక్తిగా భావిస్తారు. దీనివలన వారు చెడిపోయిన, ఆకతాయి అనే ముద్రను కూడా సంపాదిస్తారు. అయితే వీరిద్దరి మధ్యన ఉన్న పిల్లాడు తరచుగా ఇతరులకు కన్పించకుండా పోతాడు. ఇదేరకమైన వైఖరి మనం పలు సినిమాలలో కూడా చూస్తాం. కానీ మధ్యములుగా పుట్టిన వారి గురించి అందరూ మరచిపోలేదు. ఒక అధ్యయనం ప్రకారం వారు మిగిలినవారి కంటే అన్ని రంగాల్లో ముందుంటారని, నిజాయితీగా ఉంటూ గౌరవప్రదమైన జీవితాన్ని గడుపుతారని, ఇతరుల పట్ల దయతో, క్షమాగుణం కూడా ఎక్కువేనని సర్వే పేర్కొంది.

ప్రభుత్వ ఉద్యోగులకు ట్రంప్ షాక్

- 8 నెలల జీతం అందజేస్తాం.. ఉద్యోగం వదులుకోవాలని ఆఫర్
- ఖర్చు తగ్గించుకోవడానికే..

వాషింగ్టన్, జనవరి 29: కొత్తగా అధికారం చేపట్టిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రభుత్వ ఉద్యోగులను తగ్గించే పనిని ప్రారంభించారు. అందులో భాగంగా ఆయన బైఅవుట్‌లు ప్రకటించారు. తమ ఉద్యోగాలు వదిలిపెట్టే ఫెడరల్ ఉద్యోగులకు 8 నెలల జీతం అందజేస్తామని ప్రకటించారు. ఈ మేరకు ప్రభుత్వ మానవ వనరుల సంస్థ ఆఫీస్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ ఒక మెమో జారీ చేసింది. ఉద్యోగుల ప్రమాణాలు, ప్రవర్తన, అనుకూలతలను పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. సుమారు 20 లక్షల మంది ఉద్యోగులకు ఈ-మెయిళ్లు పంపింది. ఉద్యోగాన్ని వీడాలనుకునే వారికి 8 నెలల జీతాన్ని చెల్లిస్తామని, వారు తమ నిర్ణయాన్ని ఫిబ్రవరి 6 లోగా తెలియజేయాలని పేర్కొంది. తొలుత 10-15 శాతం మంది దీనికి ఓకే చెప్పవచ్చునని, దాంతో ప్రతి ఏడాది ప్రభుత్వంపై 100 బిలియన్ డాలర్ల ఖర్చు తగ్గుతుందని అంచనా. గత ఏడాది నవంబర్ నాటికి దేశంలో సుమారు 30 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. బైఅవుట్‌తో ప్రభుత్వ పాలన, ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుందని, పలు రంగాల్లో నిపుణుల కొరత ఏర్పడవచ్చునని నిపుణులు పేర్కొన్నారు.

తమిళనాడు ప్రభుత్వానికే జయలలిత ఆస్తులు

సీబీఐ కోర్టు ఆదేశం

బెంగళూరు, జనవరి 29: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలితకు చెందిన ఆస్తుల కేసులో ప్రత్యేక సీబీఐ కోర్టు బుధవారం కీలక ఆదేశాలు జారీచేసింది. జప్తు చేసిన జయలలిత ఆస్తులన్నిటినీ తమిళనాడు ప్రభుత్వానికి బదిలీ చేయాలంటూ ఆదేశాలు జారీచేసింది. జయలలితకు లీగల్ వారసులం తామేనంటూ ఆమె మేనకోడలు దీప, మేనల్లుడు దీపక్ దాఖలు చేసిన పిటిషన్లను జనవరి 13న కర్ణాటక హైకోర్టు కొట్టివేసిన నేపథ్యంలో ప్రత్యేక సీబీఐ కోర్టు ఈ ఆదేశాలిచ్చింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో జయలలితను దోషిగా సీబీఐ కోర్టు గతంలోనే తేల్చింది. 2016లో జయలలిత మరణించిన తర్వాత కేసు విచారణలో జాప్యం జరిగినప్పటికీ ఆమె ఆస్తుల జప్తును సుప్రీంకోర్టు కూడా సమర్థించింది.

వక్ఫ్ నివేదికకు జేపీసీ ఆమోదం

ఇది వక్ఫ్ బోర్డులను నాశనం చేసే ప్రయత్నం: ప్రతిపక్షం

న్యూఢిల్లీ, జనవరి 29: అధికార బీజేపీ సభ్యులు సూచించిన మార్పులతో కూడిన తన నివేదికను వక్ఫ్ సవరణ బిల్లును అధ్యయనం చేసిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) బుధవారం మెజారిటీ ఓటుతో ఆమోదించింది. అయితే ఈ నివేదికను వ్యతిరేకిస్తున్న జేపీసీలోని ప్రతిపక్ష సభ్యులు ఇది వక్ఫ్ బోర్డులను నాశనం చేసే ప్రయత్నంగా అభివర్ణించారు. నివేదికపై తమ డిస్సెంట్ నోట్‌లో తీవ్ర అభ్యంతరాలను తెలియచేశారు. బీజేపీ సభ్యుడు జగదంబికా పాల్ అధ్యక్షతన వక్ఫ్ (సవరణ) బిల్లుపై ఏర్పాటైన జేపీసీ బుధవారం 15-11 మెజారిటీ ఓటుతో ముసాయిదా చట్టానికి సబంధించిన నివేదికను ఆమోదించింది. ఈ నివేదికపై ప్రతిపక్ష సభ్యులు తమ డిస్సెంట్(అసమ్మతి) నోట్‌ను సమర్పించారు. గత ఏడాది ఆగస్టులో లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఈ బిల్లు ఉద్దేశం వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో ఆధునికతను, పారదర్శకతను, జవాబుదారీతనాన్ని తీసుకురావడమని బీజేపీ సభ్యులు వాదించగా, ఇది ముస్లిం సమాజం రాజ్యాంగ హక్కులపై దాడిగా, వక్ఫ్ బోర్డుల నిర్వహణలో జోక్యంగా ప్రతిపక్ష సభ్యులు అభివర్ణించారు. కమిటీ 28వ సమావేశం అనంతరం జగదంబికా పాల్ విలేకరులతో మాట్లాడుతూ తమ నివేదికను గురువారం(జనవరి 30) లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు సమర్పిస్తామని, శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాలలో పార్లమెంట్ ఉభయ సభలలో దీన్ని ప్రవేశపెడతారని తెలిపారు. సోమవారం జరిగిన సమావేశంలో బీజేపీ సభ్యులు సూచించిన 14 సవరణలను కమిటీ ఆమోదించింది. అయితే కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, ఆప్, శివసేన(యూబీటీ), ఏఐఎంఐఎంతోసహా ప్రతిపక్ష సభ్యులు సూచించిన ప్రతి మార్పును కమిటీ తిరస్కరించింది. కమిటీ ఆమోదించిన సవరణల ప్రకారం రాష్ట్ర వక్ఫ్ బోర్డులలో ముస్లిం ఓబీసీ వర్గానికి చెందిన ఒక సభ్యుడు ఉంటారు. అంతేగాక రాష్ట్ర ప్రభుత్వాలు అఘూఖానీ, బొహ్రా వర్గాలకు ప్రత్యేక వక్ఫ్ బోర్డులను ఏర్పాటు చేసే నిబంధనలు కూడా సవరణలలో ఉన్నాయి. వక్ఫ్ అలాల్ ఔలాద్(కుటుంబ వక్ఫ్‌లు)లో మహిళల వారసత్వ హక్కులను రాష్ట్ర ప్రభుత్వాలు పరిరక్షించే నిబంధనలు ఉన్నాయి.

ట్రిపుల్ తలాక్‌పై ఎఫ్ఐఆర్‌లు

ఎన్ని నమోదయ్యాయి?

కేంద్రం నుంచి వివరాలు కోరిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ముస్లిం మహిళా (వివాహ హక్కుల పరిరక్షణ) చట్టం, 1991 ఉల్లంఘిస్తూ తమ భార్యలకు ట్రిపుల్ తలాక్ ద్వారా విడాకులు ఇచ్చిన పురుషులపై ఎన్ని ఎఫ్ఐఆర్‌లు, చార్జిషీట్లు నమోదు చేశారో వివరాలు అందచేయాలని సుప్రీంకోర్టు బుధవారం కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ట్రిపుల్ తలాక్ పాటింపును నేరంగా పరిగణించే 2019 చట్టం రాజ్యాంగపరమైన చెల్లుబాటును సవాలుచేస్తూ వివిధ వ్యక్తులు, సంస్థలు దాఖలు చేసిన 12 పిటిషన్లపై చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. 2019 చట్టంలోని సెక్షన్ 3, 4 కింద పెండింగ్‌లో ఉన్న ఎఫ్ఐఆర్‌లు, చార్జిషీట్ల సంఖ్యను తెలియచేయాలని ప్రతివాది(కేంద్రం)ని ధర్మాసనం ఆదేశించింది. న్యాయపరమైన వైఖరిని స్పష్టం చేస్తూ ట్రిపుల్ తలాక్ చెల్లదని చట్టం చెబుతున్న తర్వాత వివాహాన్ని రద్దు చేసే అవకాశమే లేదని, ఇప్పుడు తమ తీర్పు చట్టం అమలు తీరుపైనేనని ధర్మాసనం పేర్కొంది.

యమునలో విషం ఆరోపణలు..

కేజ్రీవాల్‌కు సమన్లు

చండీగఢ్: బీజేపీ పాలిత హర్యానా రాష్ట్రం ఢిల్లీకి సరఫరా చేసే యమునా నీటిలో విషం కలిపిందని ఆరోపణలు చేసిన మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు హర్యానాలోని సోనిపట్ న్యాయస్థానం సమన్లు జారీ చేసింది. ఫిబ్రవరి 17న తమ ముందు హాజరు కావాలని సోనిపట్ చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ నేహా గోయల్ నోటీసులు పంపారు. కాగా, హర్యానా నుంచి తమకు వచ్చిన యమునా నదీ జలాలు అత్యంత కలుషితమైనవి, విషపూరితమైనవని, మానవ ఆరోగ్యానికి చేటు తెచ్చేవని అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. తాను చేసిన ఆరోపణలకు ఎన్నికల సంఘం ఇచ్చిన నోటీస్‌కు సమాధానంగా బుధవారం 14 పేజీల వివరణను సమర్పించారు.

కేజ్రీవాల్ వ్యాఖ్యలపై మండిపడ్డ మోదీ

యమునా నదిలో హర్యానా రాష్ట్రం విషం కలుపుతున్నదని కేజ్రీవాల్ చేసిన ఆరోపణలపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా మండిపడ్డారు. అసహ్యకరమైన ఆయన ఆరోపణలు నిరాశకు సంకేతమని, ఈ ఎన్నికల్లో తాము యమునా నదిలో మునుగు తామని ఆప్ పార్టీ గ్రహించిందని అన్నారు. ఆప్ నేతలను పేరుమోసిన మోసగాడు, సీరియల్ కిల్లర్ చార్లెస్ శోభరాజ్‌తో పోల్చారు.

34,300 కోట్లతో నేషనల్ క్రిటికల్ మినరల్స్ మిషన్

న్యూఢిల్లీ, జనవరి 29: ఏడేళ్ల కాలానికి విస్తరించిన రూ. 34,300 కోట్ల పెట్టుబడి అంచనాతో నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్‌కు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దేశాన్ని గ్రీన్ ఎనర్జీ వైపు మార్చే ప్రయాణాన్ని వేగవంతం చేయడం, ఈ రంగంలో స్వయం సమృద్ధిని సాధించడం లక్ష్యంగా ఈ మిషన్‌ను కేంద్రం ఏర్పాటు చేయనున్నది. ఈ మిషన్‌కు ప్రభుత్వ రంగ సంస్థలు రూ. 18,000 కోట్లు సమకూరుస్తాయని ఆశిస్తున్నట్టు మైన్స్ శాఖ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది.

ఇథనాల్ ధర పెంపు

నీ హెవీ మొలాసిస్ నుంచి తయారు చేసే ఇథనాల్ ధరను కేంద్ర ప్రభుత్వం పెంచింది. ఈ ఏడాది అక్టోబర్ 31తో ముగిసే 2024-25 సంవత్సరానికి నీ హెవ